Email : telanganaveenaofficial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




epaper.telanganaveena.com | హైదరాబాద్ | మంగళవారం 17-06-2024

# DYNAMIC

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి నల్లగొండ ఔటర్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితుల సెగ

తెలంగాణవీణ, హైదరాబాద్

* నల్లగొండ రింగ్ రోడ్డు అలైన్ మెంట్ మార్చాలని బాధితుల నిరసన
* కాళ్ల మీద పడ్డా కనికరం చూపలేదని ఆవేదన
* సీఎంరేవంత్ వచ్చినా చేసేదేమీలేదని జారుకున్న మంత్రి కోమటిరెడ్డి

రింగ్‌రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న బాధితులు నల్లగొండలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఘెరావ్ చేశారు. తమకు న్యాయం చేసే వరకు కదలనిచ్చేది లేదని రోడ్డుపై బైఠాయించారు. కొందరు మహిళలు కాళ్లు పట్టుకుని ప్రాథేయపడినా ఫలితం లేకపోయింది. తాను చేసేదేమీ లేదని, సీఎం రేవంత్ వచ్చినా ఇదే పరిస్థితి అంటూ మంత్రి పోలీసుల సాయంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తమకు న్యాయం చేస్తారని గెలిపిస్తే కష్టపడి కొనుక్కున్న తమ భూములు గుంజుకుంటున్నారని నిర్వాసితులు వాపోయారు. తమకు అన్యాయం జరిగితే కోమటిరెడ్డి పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటామన్నారు. కాగా, నల్లగొండ పట్టణం మీదుగా కేంద్ర ప్రభుత్వం 565 నంబర్ జాతీయ రహదారిని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



## తెలంగాణలో రైతు రుణమాఫీకి కొత్త రూల్..?

తెలంగాణవీణ, హైదరాబాద్

* పాస్ బుక్, రేషన్ కార్డు ఉన్న రైతులకే వర్తింపు
* ప్రతిపాదించిన అధికారులు.. పరిశీలిస్తున్న ప్రభుత్వం
* ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల రుణ మాఫీ చేయొద్దని ప్రతిపాదన



తెలంగాణ రైతుల రుణమాఫీ విషయంలో విధివిధానాల ఖరారుపై ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ఎవరికి వర్తింపజేయాలి, ఎవరెవరిని ఈ స్కీం నుంచి మినహాయించాలనే విషయంలో పలు ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుకొస్తున్నాయి. వాటిని పరిశీలిసూ ఆగస్టు 15 లోగా రుణమాఫీ పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి సర్కారు ప్రయత్నిస్తోంది. ఇటీవలి లోక్ సభ ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఎట్టిపరిస్థితుల్లోనూ అమలుచేసి చూపాలని కృతనిశ్చయంతో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే అధికారులు ఓ కొత్త ప్రతిపాదనను ప్రభుత్వం ముందు ఉంచారు. రాష్ట్రంలో ల్యాండ్ పాస్ బుక్, రేషన్ కార్డు ఉన్న రైతులకే రుణమాఫీ వర్తింపజేయాలని చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆదాయపన్ను చెల్లిస్తున్నవారు, ఉద్యోగులను ఈ పథకం నుంచి మినహాయించాలని మంత్రిమండలి సమావేశంలో ప్రతిపాదించారు. మరోవైపు, రూ.2 లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతుల వివరాలను బ్యాంకర్ల నుంచి ప్రభుత్వం తెప్పిస్తోంది.

### భారం తగ్గే మార్గాలు.


తెలంగాణలో ఇప్పటికే అమలు చేస్తున్న రైతుబంధు పథకానికి 66 లక్షల మంది లబ్దిదారులు ఉన్నారు. దాదాపుగా వీరంతా రూ.2 లక్షల లోపు రుణం పొందారని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే, రైతుబంధు లబ్దిదారులలో సుమారు 6 లక్షల మందికి ల్యాండ్ పాస్ బుక్ లు లేవని, దీనిని ప్రామాణికంగా తీసుకుంటే రుణమాఫీ లబ్దిదారుల సంఖ్య తగ్గుతుందని చెబుతున్నారు. దీనివల్ల 6 లక్షల మంది, రేషన్ కార్డును కూడా ప్రామాణికంగా తీసుకుంటే మరో 18 లక్షల మంది లబ్దిదారులు తగ్గుతారని వివరించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆదాయపు పన్ను చెల్లించేవారు, ప్రభుత్వ ఉద్యోగులను కూడా ఈ స్కీం నుంచి తప్పిస్తే రుణమాఫీ భారం మరింత తగ్గుతుందని చెప్పారు. ఈ మినహాయింపుల తర్వాత సుమారు 40 లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా తేలతారని వివరించారు.

### వర్తింపు ఎప్పటి నుంచి..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తేదీ నుంచి గతేడాది ముందు వరకు మినహాయించి అంతకుముందు తీసుకున్న రుణాలకే మాఫీ వర్తింపజేయాలని అధికారులు మరో ప్రతిపాదన చేశారు. అయితే, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం విముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రైతు రుణమాఫీకి కటాఫ్ తేదీగా 2018 డిసెంబరు 12 ను నిర్ణయించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ తేదీ తర్వాత తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రుణమాఫీ అర్హులను తేల్చే విషయంలో, విధివిధానాల రూపకల్పనలో మంత్రిమండలిలో సమగ్ర చర్చ తర్వాతే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

## పోలవరం పరిశీలనలో సీఎం చంద్రబాబు.. పనుల పురోగతిపై ఆరా

తెలంగాణవీణ, ఏపీ బ్యూరో



ఆంధ్రప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు దగ్గరకు చేరుకున్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ఆయనకు మంత్రులు నిమ్మల, పార్థ సారథి, కందుల దుర్గేష్ సహా.. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు.. కూటమి నేతులు స్వాగతం పలికారు.. అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు.. ఆ వెంటనే.. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు బయల్దేరారు.. గతంలో ప్రతీ సోమవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించిన ఆయన.. మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ.. ప్రాజెక్టు పరిశీలనకు వచ్చారు.. మొదట వ్యూ పాయింట్ నుంచి పోలవరం పనుల పురోగతని పరిశీలించిన చంద్రబాబు.. వివిధ దశల్లో ఉన్న ప్రాజెక్టు పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.. ఆ తర్వాత పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే పైకి చేరుకున్నారు.. స్పిల్ వే 26వ గేట్ వద్ద పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు సీఎం చంద్రబాబు.. ఇక, ప్రాజెక్టు పనులను పరిశీలించిన తర్వాత మధ్యాహ్నం 2. 05 గంటల నుండి 3.05 గంటల వరకు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు ఏపీ సీఎం.. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడనున్నారు.మరోవైపు 31-05-2024 నాటికి పోలవరం ప్రాజెక్టు వర్క్ ప్రోగ్రెస్ చూస్తే.. హెడ్ వర్క్స్-72.63శాతం, రైట్ మెయిన్ కెనాల్-92.75 శాతం, లెఫ్ట్ మెయిన్ కెనాల్-73.07 శాతం, భూసేకరణ-పునరావాసం-22.55 శాతం, ప్రాజెక్టులో అన్ని పనులు కలిపి 49.79 శాతం పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు.. మెయిన్ డ్యాం ప్యాకేజ్‌లో 1. స్పిల్ వే అండ్ రేడియల్ గేట్లు పనులు పూర్తి, 2. ఎగువ, దిగువ కాఫర్ ఢ్యాంలు-రెండూ పూర్తయ్యాయి.. 3. ఈసీఆర్‌ఎఫ్ ఢ్యాం(ఎర్త్ కం రాక్ ఫిల్ ఢ్యాం), గ్యాప్-1: ఢయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి అయింది. నేలను గట్టిపరిచే పనులు జరుగుతున్నాయి. గ్యాప్-2 : నేలను గట్టిపరిచే పనులు జరుగుతున్నాయి. ఢయా ఫ్రం వాల్ రిపేర్ల పనులు మొదలయ్యాయి. గ్యాప్-3 : కాంక్రీట్ ఢ్యాం నిర్మాణ పనులు పూర్తయ్యాయంటున్నారు. స్పిల్ ఛానెల్-88శాతం పనులు పూర్తయ్యాయి. అప్రోచ్ ఛానెల్-79శాతం పనులు పూర్తి. ఫైలెట్ ఛానెల్-48 శాతం పనులు పూర్తి.. రైట్ అండ్ లెఫ్ట్ కనెక్టివిటీస్-68 శాతం పనులు పూర్తి చేసినట్టు సమాచారం

## రుషికొండ భవనాన్ని జగన్ ఇల్లుగా చూపించడం మానుకోండి గుడివాడ అమర్‌నాథ్



తెలంగాణవీణ, ఏపీ బ్యూరో

* దానిని ఎలా ఉపయోగించుకోవాలన్నది ప్రభుత్వ ఇష్టమన్న అమర్ నాథ్
* తాము మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖ నుంచే పాలించాలని అనుకున్నామని వెల్లడి
* ఐఏఎస్ అధికారులతో కమిటీ వేశాకే భవనాలు నిర్మించామని వివరణ
* రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్ వంటి వారి ఆతిథ్యానికి వాటిని వాడుకోవచ్చని సూచన
* ప్రజలను తప్పుదోవ పట్టించే చర్యలు మానుకుంటే మంచిదని సలహా

రుషికొండ భవనాల చుట్టూ వస్తున్న వార్తలపై వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్పందించారు. ఆ భవనాలను ఎలా ఉపయోగించుకోవాలన్నది ఆలోచించడం మానేసి, దానిని ఇంకా జగన్‌మోహన్‌రెడ్డి ఇల్లుగానే చిత్రీకరించడాన్ని మానుకోవాలని టీడీపీ నేతలకు సూచించారు. విశాఖను తాము ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ చేయాలని అనుకున్నామని కానీ, అనేక అడ్డంకులు సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖ నుంచే పాలించాలని అనుకున్నామని, ఐఏఎస్ అధికారులతో కమిటీ వేసిన తర్వాత రుషికొండలో భవనాలు నిర్మించినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ ధనం దుర్వినియోగం గురించి మాట్లాడాల్సి వస్తే 2014 నుంచి 2019 వరకు జరిగిన దానిపైనా మాట్లాడాల్సి వస్తుందని పేర్కొన్నారు. తాము ఇప్పుడే విమర్శలు చేస్తే అధికారం కోల్పోవడాన్ని జీర్ణించుకోలేక చేస్తున్నామని అనుకుంటారనే అలాంటి విషయాల జోలికి పోవడం లేదని తెలిపారు. నగరానికి రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్, లేదంటే ఇతర ముఖ్యులు వస్తే ప్రైవేటు హోటళ్లలోనో, మరెక్కడో ఉంచాల్సిన పరిస్థితి వస్తోందని, ఇప్పుడు రుషికొండ భవనాలను వారి ఆతిథ్యానికి వాడుకోవచ్చని వివరించారు. దీనిపై ఇంకా రాద్ధాంతం తగదని హితవు పలికారు. ప్రజలిచ్చిన అధికారాన్ని తమకంటే మంచి చేయడానికి ఉపయోగించాలని, ప్రజలను ఇలా తప్పుదోవ పట్టించే చర్యలకు ఉపయోగించవద్దని అమర్‌నాథ్ హితవు పలికారు.